సాక్షి రంగారెడ్డి

సోమవారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2024



ఆలయ భూమి ఎవరికో!

యాచారం మండల పరిధిలోని నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములపై సందిగ్ధం నెలకొంది. 8లో▸



సేవలు అభినందనీయం

పేద విద్యార్థులను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించడం దేవుడిచ్చిన వరమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కోటి మొక్కులు

మహేశ్వరంలోని శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయంలో గడికోట మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

షాద్‌నగర్ ఎంవీఐ బాలు నాయక్ బదిలీ

షాద్‌నగర్: షాద్‌నగర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడు సంవత్సరాల పాటు ఇక్కడ సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఆయనను నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేశారు. బాలు నాయక్ స్థానంలో కొత్తగా ఇక్కడికి హైదరాబాద్‌లో పని చేస్తున్న వాసు రానున్నారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



హుడాకాంప్లెక్స్: వీధి కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా తిరుమలగిరికి చెందిన కొమ్మ మధు బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసివచ్చి సరూర్ నగర్ డివిజన్ పరిధి జింకల బావి కాలనీలో నివసిస్తున్నారు. బట్టల దుకాణంలో గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమారుడు వినీత్ (7) సరూర్ నగర్‌లోని లయోలా స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం లక్ష రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ముగిసిన నుమాయిష్

చివరి రోజు 70 వేల మంది సందర్శకులు



అబిడ్స్: ఎగ్జిబిషన్ (నుమాయిష్) ఆదివారంతో ముగిసింది. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల జనవరి 1వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి వరకు కొనసాగింది. ప్రతి సంవత్సరం 46 రోజులు కొనసాగే ఎగ్జిబిషన్ ఈసారి 49 రోజుల పాటు కొనసాగింది. ముగింపు రోజు ఆదివారం మధ్యాహ్నం నుంచే సందర్శకులు భారీగా తరలివచ్చారు. సుమారు 70 వేల మంది వచ్చినట్లు బుకింగ్ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. 49 రోజుల్లో మొత్తం 22 లక్షల మంది నుమాయిష్‌కు వచ్చినట్లు అంచనా. 2,400 స్టాళ్లను ఏర్పాటు చేశామని, కనువిందు చేసేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, జాయింట్ సెక్రటరీ స్వర్ణజిత్ సింగ్, కోశాధికారి రాజేంద్రకుమార్‌లు తెలిపారు. గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన



బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాల్‌ను పరిశీలిస్తున్న సంజయ్ జాజు

నాంపల్లి: సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గంలోని బజార్‌ఘాట్ గోకుల్‌నగర్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రాథమిక లక్ష్యాలు పౌరులకు అందుబాటులో ఉండేలా పలు రకాల సంక్షేమ పథకాల స్టాళ్లను స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు హాజరై యాత్ర ఉద్దేశాలు, విశేషాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆధార్ నమోదు, ముద్ర రుణాల మంజూరు, జీరో బ్యాలెన్స్ అకౌంట్లు, ఉచిత వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ శృతి పాటిల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం అనిరుధ్ దేశ్‌పాండే, బీజేపీ నేతలు రాహుల్‌చంద్ర, జగన్నాథరాజు, భుజందర్ రావు, కె.పవన్ తదితరులు పాల్గొన్నారు.

అందరి గురి.. చేవెళ్ల బరి



హాట్ సీటుగా లోక్‌సభ స్థానం

- బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీకే అవకాశం
- బీజేపీ నుంచి కొండా పేరు దాదాపు ఖరారు
- కాంగ్రెస్ నుంచి కేఎల్‌ఆర్, సునీతారెడ్డి మధ్య పోటీ
- ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టిన ఆశావహులు
- ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే చాన్స్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ స్థానాలకు ఏ క్షణమైనా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉండటంతో ఇటు జిల్లా యంత్రాంగంతో పాటు అటు రాజకీయ పార్టీలు కూడా సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని కీలకమైన చేవెళ్ల స్థానంపై అధికార కాంగ్రెస్ సహా ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ దృష్టి సారించాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డినే మళ్లీ బరిలోకి దించనున్నట్లు ఇప్పటికే బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఆయన పేరే దాదాపు ఖరారు చేసే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ నుంచి రోజుకో కొత్త అభ్యర్థి తెరపైకి వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయనున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయనకు మధ్య కొంత అభిప్రాయ బేధాలు తలెత్తడంతో ఆయనకు ఈ స్థానం దక్కకపోవచ్చనే చర్చ నడుస్తోంది. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి రెండు రోజుల క్రితం కారు దిగి హస్తం పార్టీలో చేరడంతో ఆమెకే అవకాశం ఉంటుందన్న ప్రచారం ఊపందుకుంది. మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉద్దండులు బరిలోకి దిగనుండడంతో ఈసారి చేవెళ్ల పోరు రసవత్తరంగా మారనుంది.

క్షేత్రస్థాయిలో ఆశావహులు

చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలో మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. షాద్‌నగర్, కొడంగల్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్ పరిధిలో ఉండగా, కల్వకుర్తి నియోజకవర్గం నాగర్‌కర్నూల్ పరిధిలో కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం భువనగిరి పరిధిలో, ఎల్బీనగర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలో కొనసాగుతున్నాయి. 2019లో ఎన్నికల్లో 23 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 12,70,687 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్ రెడ్డికి 5,16,363 ఓట్లు (40.64 శాతం) రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 5,0,318 ఓట్లు (39. 61శాతం)వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బి.జనార్దన్‌రెడ్డికి 1,95,919 ఓట్లు (15.42 శాతం) వచ్చాయి. బీఎస్పీ సహా ఇతర పార్టీలకు డిపాజిట్ దక్కలేదు. పోటీలో ఉన్న 20 మందికి నోటా (9,045) కంటే తక్కువ ఓట్లు పోలవడం గమనార్హం. 2024 ఫిబ్రవరి 8 నాటికి ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 29,14,124 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. వీరిలో 14,93,369 మంది పురుషులు, 14,20,469 మంది మహిళలు ఉన్నారు. మరో 286 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు పోటాపోటీగా తలపడనున్నారు. ఆయా పార్టీల నుంచి టికెట్లు ఆశించే నేతలంతా ఆర్థికంగా బలవంతులు కావడంతో ఎన్నికల కోసం భారీగా ఖర్చుపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే వీరంతా క్షేత్రస్థాయిలో పర్యటించడంతోపాటు ఇతర పార్టీల్లో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వల వేస్తున్నారు. వీరికి భవిష్యత్తులో పలు రాజకీయ పదవులతో పాటు నగదు, ఖరీదైన వాహనాలు ఎరగా చూపుతున్నట్లు తెలిసింది.

తుది ఓటరు జాబితా వెల్లడి

లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు జాతీయ ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటించింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ నెల 8న జాబితా విడుదల చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,369 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో 35,91,987 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 18,50,292 మంది పురుషులు, 17,40,379 మంది మహిళలు ఉన్నారు. 449 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. వీరితో పాటు 286 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, మరో 581 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. వికారాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,84,068 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది మహిళలు ఉన్నారు. మరో 39 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు.

నియోజకవర్గ పరిధిలో ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,56,110	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,778	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,757	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,166	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	133625	132639	09
వికారాబాద్	284	2,31,679	115019	116647	13
తాండూరు	269	2,42,3849	118228	125614	07

లీజుకు 38.59 ఎకరాలు



భూముల అప్పగింతకు ఆర్టీసీ సిద్ధం

- లైసెన్స్ ఫీజుల రూపంలో ఇచ్చేందుకు టెండర్లు
- మార్చి 15 వరకు దరఖాస్తుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని విలువైన స్థలాలను ప్రతి నెలా లైసెన్సు ఫీజుల రూపంలో లీజుకు ఇచ్చేందుకు అధికారులు ఆన్‌లైన్ టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వివిధ చోట్ల ఉన్న సుమారు 38.59 ఎకరాలను లీజుకు ఇవ్వనున్నారు. ఈ స్థలాలపై లీజు దక్కించుకున్న సంస్థలు లాజిస్టిక్ వేర్‌హౌస్‌లు, ఆటోమొబైల్ సర్వీస్ సెంటర్లు, షోరూంలు తదితర అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

- టికెట్టేతర ఆదాయాన్ని పెంచుకొనే చర్యల్లో భాగంగా ఇప్పటికే బస్‌స్టేషన్లు, ప్రయాణ ప్రాంగణాలు తదితర ప్రాంతాల్లో స్టాళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కార్యాలయాలకు భవనాలను అద్దెకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఆర్టీసీకి వివిధ ప్రాంతాల్లో ఉన్న సొంత స్థలాలను లైసెన్సు ఫీజుల రూపంలో లీజుకు ఇవ్వడంపై అధికారులు దృష్టి సారించారు. ఈ స్థలాలపై సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో రూ.63 లక్షలకుపైగా లభించనుంది.
- ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలను లీజుకు తీసుకొనేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు లేదా వ్యాపారులు మార్చి 15వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు టెండర్లను దాఖలు చేయొచ్చు. మరుసటి రోజు జూబ్లీ బస్ స్టేషన్‌లోని ఈడీ కార్యాలయంలో టెండర్లను ఓపెన్ చేయనున్నారు. మరోవైపు ఈ నెల 27న స్థలాల లీజుపై ప్రీబిడ్డింగ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎక్కడెక్కడ ఎంత..

ప్రాంతం	స్థలం (ఎకరాల్లో)	దరావత్తు (రూ.లక్షల్లో)
కాచిగూడ	4.14	27
మేడ్చల్	2.83	8
శామీర్‌పేట్	3.26	5
హకీంపేట్	2.93	4
చెంగిచెర్ల	2.68	4
రషీద్‌గూడ-1	4.75	3
రషీద్‌గూడ-2	6.03	4
తుర్కయంజాల్ -1	5.74	4
తుర్కయంజాల్-2	6.23	4

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో క్లబ్ రన్-2024 పేరిట ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. రన్‌లో సుమారు 2 వేల మంది పాల్గొన్నారు. రన్‌ను హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారామ్, తెలంగాణ ఐజీపీ ఎం.రమేష్‌రెడ్డి, మాదాపూర్ డీసీపీ జి.వినీత్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పోజిషన్ లిమిటెడ్ సీఈఓ. టి.జి శ్రీకాంత్, హైదరాబాద్ రన్నర్స్ కార్యదర్శి అరుణ్‌కుమార్ కలియప్పన్, క్లబ్ రన్-2024 రేస్ డైరెక్టర్ అజిత్ మిశ్రా మెడల్స్ అందించి అభినందించారు. – రాయదుర్గం







సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునితా రెడ్డి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి

పహాడీషరీఫ్: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మహేశ్వరం డీసీపీ డి.సునితా రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మెడికల్ షాప్ నిర్వాహకులతో షాహిన్‌నగర్‌లోని ఉమర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం డ్రగ్స్‌పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొందరు విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలకు బానిసై నేరస్తులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, వైట్నర్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలతో సమాజానికి హాని కలిగిస్తున్నారన్నారు. బయట మార్కెట్లలో లభ్యమయ్యే మత్తు పదార్థాలపై పోలీస్ నిఘా పెంచి కట్టడి చేస్తుండడంతో మెడికల్ దుకాణాల్లో లభించే డ్రగ్స్ తీసుకొని మత్తులోకి జారుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో మెడికల్ షాప్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దని, అలా విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్ రెడ్డి, గురువా రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'సీవోఈ సెట్'

షాద్‌నగర్‌రూరల్: గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) సెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థుల హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, బోనఫైడ్, పరీక్ష ప్యాడ్ తనిఖీచేసి కేంద్రంలోకి అనుమతించారు. సాంఘీక సంక్షేమ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 312 మంది విద్యార్థులకుగాను 280 మంది హాజరు కాగా 32మంది గైర్హాజరయ్యారు. సీవోఈ సెట్ పరీక్ష కేంద్రం పరిశీలకురాలు ఓఎస్‌డీ అశ్విని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సురేందర్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రంవద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుస్తకం రమ్మంది

బుక్‌ఫెయిర్‌కు పోటెత్తిన సందర్శకులు • నేటితో ముగియనున్న ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు ఆదివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవురోజు కావడంతో పాటు సోమవారంతో పుస్తక ప్రదర్శన ముగియనున్న దృష్ట్యా సందర్శకులు పోటెత్తారు. పుస్తకాల విక్రయాలు సైతం భారీగానే ఉన్నట్లు స్టాళ్ల నిర్వాహకులు తెలిపారు. తెలుగు సాహిత్యంతో పాటు ఈసారి విశేషంగా దళిత సాహిత్యంపై వెలువడిన పుస్తకాలు విరివిగా అమ్ముడైనట్లు వెల్లడించారు. అంబేడ్కర్ రచనలు, పోటీ పరీక్షల కోసం రూపొందించిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌కు బాగా డిమాండ్ కనిపించింది. ఆ తర్వాత వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, కెరీర్ గైడెన్స్‌పై వెలువడిన పుస్తకాలు కొనుగోలు చేశారు. తెలుగు, ఆంగ్ల భాషల బాల సాహిత్యానికి కూడా బాగా డిమాండ్ కనిపించింది. కథల పుస్తకాలు, ఫిక్షన్, ప్రముఖుల జీవిత చరిత్రలు ఎక్కువగా అమ్ముడయ్యాయి.

- సాధారణంగా ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో చివరి 10 రోజుల పాటు హైదరాబాద్ జాతీయ ప్రదర్శన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి ఎన్నికలతో పాటు, వివిధ కారణాల దృష్ట్యా ఈ నెల 9 నుంచి ప్రదర్శన ప్రారంభమైంది. సోమవారం ప్రదర్శన ముగియనుంది. జాతీయ, అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు పాల్గొన్నాయి. సాహిత్య సదస్సులు, పుస్తక ఆవిష్కరణ సభలతో ప్రదర్శన కళకళలాడింది. పలు పాఠశాలలకు చెందిన చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచేందుకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఓ స్టాల్‌లో పుస్తక విక్రయాలు..



పుస్తకాలను పరిశీలిస్తున్న యువతి



పుస్తక ప్రియులతో ఎన్టీఆర్ స్టేడియం కిటకిట

ఆలయ భూమి ఎవరికో!

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములపై సందిగ్ధం నెలకొంది. జిల్లాలో ఏ ఆలయానికి లేని విధంగా నందివనపర్తి ఓంకారేశ్వరుడికి నందివనపర్తి, తాడిపర్తి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో 1,452 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 1,452 ఎకరాల్లో 1,252 ఎకరాల భూమి వ్యవసాయానికి యోగ్యంగా ఉండడం, 200 ఎకరాలు పూర్తిగా గుట్టలు, రాళ్లు, రప్పలతో ఉంది. ఆ వ్యవసాయ భూమిని 450 మందికి పైగా కౌలు రైతులు ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. రైతులు పదేళ్ల కిందటి వరకు ఎకరాకు రూ.5 నుంచి రూ.15 వరకే కౌలు చెల్లించేవారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో వంద శాతం సాగు యోగ్యమైన భూమికి ఎకరాకు రూ.100, సాగుకు పనికివచ్చే భూమికి ఎకరాకు రూ.80, సాగుకు పనికిరాని భూమికి ఎకరాకు రూ.60 చొప్పున కౌలు చెల్లించాలని నిర్ణయించారు. ఆ మాదిరిగా అధికారులు వసూలు చేసిన కౌలు డబ్బులతో ఓంకారేశ్వరుడికి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.

1,026 ఎకరాలు కేటాయించాలని..

ఫార్మాసిటీకి భూసేకరణలో భాగంగా ఓంకారేశ్వరాలయానికి చెందిన సర్వే నంబర్లు 163, 180, 211, 212 తదితర వాటిలో 1,026 ఎకరాల భూమిని ఇచ్చే విధంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖను ఆదేశించాలని టీఎస్‌ఐఐసీ ఏడాది కింద హైకోర్టును ఆశ్రయించింది. టీఎస్‌ఐఐసీ(తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన సంస్థ) విజ్ఞప్తికి అధికారులు సుముఖత తెలిపి భూ సేకరణ పరిహారాన్ని ఆలయ బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా నిర్ణయించారు. టీఎస్‌ఐఐసీకి ఆలయ భూములు అప్పగించే విషయం వెలుగులోకి రావడంతో కౌలు రైతుల్లో ఆందోళన మొదలైంది. 80 ఏళ్లకు పైగా ఆ భూమిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం.. వాటిపై కౌలు హక్కులు కూడా ఉన్నాయి. ఏటా కౌలు డబ్బులు సైతం చెల్లిస్తున్నాం.. ఇస్తే మాకే భూములపై హక్కులు కల్పించాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు వచ్చిన దేవాదాయ, ధర్మాదాయ, రెవెన్యూ, సర్వే, టీఎస్‌ఐఐసీ అధికారులను కౌలు రైతులు అడ్డుకొని వెనక్కు పంపించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆలయ భూములు కౌలు రైతులకు చెందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయ భూములపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు.



నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయం



నస్దిక్‌సింగారంలో కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూమి

ఓంకారేశ్వరుడి భూములు ఇవ్వాలని టీఎస్‌ఐఐసీ వినతి

- కౌలు రైతులకు అనుకూలంగా స్టే విధించిన హైకోర్టు

కౌలు రైతుల్లో ఆశలు

ఓంకారేశ్వరుడి భూములపై హైకోర్టు ఇచ్చిన స్టేతో సందిగ్ధం నెలకొంది. ఆలయ భూముల పంచాయతీ హైకోర్టుకు చేరడంతో అధికారులు కూడా నెమ్మదించారు. ఏళ్లుగా ఆలయానికి దాదాపు రూ.కోటికి పైగా కౌలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. కౌలు రైతులకు అనుకూలంగా హైకోర్టు స్టే విధించడంతో భూములపై హక్కులు కల్పించాలని కోరుతున్నారు. గతంలో ఏటా మార్చి లోపే నోటీసులు పంపి జూన్ లోపు అధికారులు కౌలు వసూలు చేసేవారు. ధరణి పోర్టల్ రాకముందు పహాణిలో కౌలు రైతుల పేర్లు నమోదవుతుండేవి. ధరణి అనంతరం రెవెన్యూ రికార్డుల్లో కౌలు రైతుల పేర్లు తీసేసి ఓంకారేశ్వరుడిపై నమోదు చేశారు. దీంతో పూర్తి హక్కులు కల్పించాలని కౌలు రైతులు మొండికేస్తున్నారు. హైకోర్టు స్టేతో అధికారులు కూడా ఆలయ భూములపై ఏ నిర్ణయం తీసుకోలేక పోతున్నారు.

రూ.10 లక్షలు ఖర్చు చేశాం



నస్దిక్‌సింగారం గ్రామంలో మా కుటుంబ సభ్యులకు 24 ఎకరాల ఓంకారేశ్వరాలయ భూమి ఉంది. ఆలయ భూమిని సాగులోకి మార్చుకోవడం కోసం రూ.10 లక్షలకు పైగానే ఖర్చు చేశాం. ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించాలి. ఇక కౌలు కూడా చెల్లించేది లేదు.

– ఆదిరెడ్డి రాజిరెడ్డి, కౌలు రైతు, నస్దిక్‌సింగారం

జీవనోపాధికి తూట్లు



ఏళ్లుగా ఆలయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం. నస్దిక్‌సింగారంలో సర్వేనంబరు 262, 242లలో ఆరు ఎకరాల ఆలయ భూమి ఉంది. దాన్ని నమ్ముకొనే జీవనోపాధి పొందుతున్నాం. భూములు పోతే మా ప్రాణాలు వదులుకున్నట్లే. దానిపై హక్కులు కల్పించాలి.

– మచ్చ అంజయ్య, కౌలు రైతు, నస్దిక్‌సింగారం

రూ.లక్షల్లో బకాయిలు



ఓంకారేశ్వరాలయ భూములపై హైకోర్టు స్టే విధించింది. మా ఉన్నతాధికారులు కూడా కోర్టుకెళ్లారు. ఆదేశాలు వచ్చే వరకు ఏ నిర్ణయం తీసుకునేది లేదు. కొంత మంది రైతులు కౌలు డబ్బులు చెల్లిస్తామని అంటున్నారు. ఆలయ భూముల విలువ నేడు రూ.కోట్లకు పెరిగింది. కౌలు డబ్బులు సక్రమంగా ఇవ్వడం లేదు. నేటికీ రూ.లక్షల్లో కౌలు బకాయిలు ఉన్నాయి.

– ప్రవీణ్‌కుమార్, ఈఓ, నందివనపర్తి ఓంకారేశ్వరాలయం

‘బాలాగ్రామ్’ సేవలు అభినందనీయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: పేద విద్యార్థులను చేరదీసి, అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం దేవుడిచ్చిన వరమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండా గ్రామ పరిధిలో ఉన్న సెయింట్ గ్రీగోరియస్ బాలాగ్రామ్ పాఠశాల వార్షికోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా బాలాగ్రామ్ యాజమాన్యం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అనాథ, పేద విద్యార్థులను చిన్ననాటి నుంచే చేరదీసి, విద్యాబుద్ధులు నేర్పించడం ఎంతో అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు కోల్పోయి ఏ దిక్కులేని విద్యార్థులు ఎంతో మంది ఈ విద్యాలయంలో చదివి ఉన్నత స్థానాల్లో ఉండడం సంతోషించాల్సిన విషయమన్నారు. ప్రభుత్వం నుంచి బాలాగ్రామ్ గ్రీగోరియస్ ఉన్నత పాఠశాల, కంటి ఆస్పత్రికి అన్ని విధాలుగా తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. యాజమాన్యంతో మాట్లాడి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గ్రీగోరియస్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ మార్కులతో విద్యార్థులు పాసయ్యేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో సెయింట్ గ్రీగోరియస్ యాజమాన్యం, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న శ్రీ గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 21 నుంచి 25 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాల కరపత్రాలను ఆదివారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. కల్యాణోత్సవాలు విజయవంతం చేసేలా ప్రజలు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కట్టెకొమ్ముల నారాయణరెడ్డి, మారేడ్‌పల్లి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మకు.. కోటి మొక్కులు

శివగంగ ఆలయం నుంచి బోనాల సమర్పణ

మహేశ్వరం: మండల కేంద్రంలోని శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయంలో గడికోట మైసమ్మ బోనాల ఉత్సవాలను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అక్కన్న మాదన్నల కాలం నుంచి మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో వైభవంగా నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందుగా మైసమ్మకు బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆలయ చైర్మన్, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గడికోటలో ఉన్న కోట మైసమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బోనాల అనంతరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల పనులు, ఆలయానికి రంగులు, ఇతర పనులు ప్రారంభిస్తారు. వచ్చే నెల 8న జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ అల్లెకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుదర్శన్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఎం.రాకేశ్, ఎ.రాకేశ్, కన్నయ్య, జగన్, సాయిలు, శ్రీశైలం, ఆలయ ఈఓ మురళి కృష్ణ, నాయకులు ఈశ్వర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, జంగయ్య ముదిరాజ్, ఏకలవ్య, పరమేశ్, పెంటయ్య, చంద్రయ్య, నర్సింహ, శ్రీకాంత్, శ్రీను, పూజారి వీరేశం భక్తులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో ఆలయ చైర్మన్, డైరెక్టర్లు

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ..

ఇద్దరి దుర్మరణం

మహేశ్వరం: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ గేటు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కందుకూరు సీఐ మక్బుల్ జానీ తెలిపిన ప్రకారం.. కందుకూరు గ్రామానికి చెందిన సుదర్శన్‌చారి(40) మీర్కాన్‌పేట్ నుంచి కందుకూరు వైపు బజాజ్ పల్సర్ బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన చిలుకల రమేశ్(35) కందుకూరు గేటు నుంచి తన స్వగ్రామం వైపు వెళ్తున్నాడు. అన్నోజిగూడ గేటు వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుదర్శన్ చారి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, చిలుకల రమేశ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందడంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆమనగల్లు: పట్టణంలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మేడిగడ్డతండాకు చెందిన కృష్ణ(41) ఈ నెల 16న ద్విచక్ర వాహనంపై ఆమనగల్లుకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దీనిపై మృతుని భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కడ్తాల్: షాద్‌నగర్–కడ్తాల్ ప్రధాన రహదారిపై బైక్, ఆటో ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని టాక్‌రాజ్‌గూడ తండా సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన యాట వెంకటేశ్ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై కడ్తాల్‌కు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో టాక్‌రాజ్‌గూడ సమీపంలో ఎదురుగా వస్తున్నా ఆటో అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టిన స్కూలు బస్సు

నలుగురు యువకులకు తీవ్రగాయాలు

పహాడీషరీఫ్: స్కూలు బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ నుంచి మామిడిపల్లి మీదుగా ఓ ఆటోలో ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, శివకుమార్, పాండు మైలార్‌దేవ్‌పల్లికి వెళ్తున్నారు. సీఐఎస్‌ఎఫ్ క్వార్టర్స్ సమీపంలో రోడ్డు నిర్మిస్తుండడంతో ఒకే మార్గంలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ సమయంలో ఎదురెదురుగా వస్తున్న ఆటో, ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జయి అందులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

గురుస్వామికి ప్రముఖుల నివాళి

షాద్‌నగర్: అందరినీ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన గురుస్వామి సతీష్‌నాయర్ అనారోగ్యంతో మృతి చెందడటంతో విశ్వాసులు కన్నీటి పర్యంతం అయ్యారు. కొంత కాలంగా అనారోగ్యం బారిన పడిన సతీషన్‌నాయర్ శనివారం తుది శ్వాస విడిచిన విషయం విదితమే. స్వగ్రామమైన పాల్మాకులలో ఆదివారం మధ్యాహ్నం ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ యాత్రలో సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్, శ్యాంసుందర్‌రెడ్డిలు అంతిమయాత్రలో పాడెను మోశారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మహతి మౌక్తికములు కావ్యావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు

ఆమనగల్లు: పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు, కవి దాస ఈశ్వరమ్మ రచించిన మహతి మౌక్తికములు కావ్యాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా.నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. నగరంలోని రవీంద్రభారతిలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం కింద కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ రచించిన కావ్యం మహతి మౌక్తికములను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డా.ఏనుగు నర్సింహారెడ్డితో కలిసి డా.నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహతి సాహితీ కవి సంగమం అధ్యక్షుడు డా.అడిగొప్పుల సదయ్య, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రజా సేవలోనే సంతృప్తి

మొయినాబాద్‌రూరల్: ప్రజలకు సేవ చేసే భాగ్యం కొందరికే లభిస్తుందని విశ్వకర్మ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పూలగుళ్ల శ్రీనివాసచారి అన్నారు. ఆయన పదవీ విరమణ అభినందన సభను ఆదివారం నగరంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. దీనికి మండలం నుంచి విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి, బాకారం వీరచారిల ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి దంపతులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ అనేది ఎప్పటికీ తప్పదని అన్నారు. ప్రజలకు సేవ చేసే అదృష్టం రావడం సంతోషకరమన్నారు. జిల్లాలోని విశ్వకర్మ సంఘం సభ్యులతో పాటు ప్రజలందరికీ సేవా కార్యక్రమాలు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కష్టపడి పని చేసే వారిని ప్రజలు గుర్తిస్తారని అలాంటి భాగ్యం తనకు భగవంతుడు ప్రసాదించారన్నారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల విశ్వకర్మ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



శ్రీనివాసచారి దంపతులను సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

ఎండుతున్న పంటలు

లోవోల్టేజీతో కరెంట్ సరఫరాకు అంతరాయం

శంషాబాద్ రూరల్: లోవోల్టేజీ సమస్య రైతులను వేధిస్తున్నది. తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ సరఫరా నిలిచిపోతుండడంతో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని రాయన్నగూడ పరిధిలో గల ట్రాన్స్‌ఫార్మర్‌కు 20 రోజులుగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి సాగుకు ఇబ్బందులు..

ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 13 బోర్లు ఉన్నాయి. ఈ నీటితోనే రైతులు సుమారు 30 ఎకరాల్లో వరి, కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. అయితే తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి ఫ్యూజులు ఎగిరిపోయి కరెంట్ నిలిచిపోయి బోర్లు నడవడం లేదు.దీంతో పంటలకు సాగునీరు అందకుండా పోతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ చేయాలని, లేకుంటే ఉన్న పంటలు కూడా చేతికి రాకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాయన్నగూడలో అధిక లోడుతో మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్